# కవి హృదయం

1976వ సంవత్సరం ఫిబ్రవరి పన్నెండవ తారీకు, గురువారంనా మీరు హైద్రాబాద్‌లోని ప్రకాష్‌నగర్ బస్‌స్టాప్ దగ్గర నిలబడి వుం సికింద్రాబాదు స్టేషన్‌వైపు వెళ్ళే బస్ నెంబర్ 33 ఎంతరష్‌గా వున్నదీ అవగతమయ్యేది. ఆ సమయంలో నేనక్కడే ఉన్నాను

ఏభై నిముషాలు నిలబడ్డాక, అదృష్టవశాత్తు ఓ డబుల్‌డెక్కర్ ఆగింది. ఆరు పదిహేనుకు అందింది నాకు బస్. ఆఫీసు వదిలాక. కూర్చునేందుకు సీట్ లేదు అలాగే తోసుకొని ఎక్కాను జాగాలేకపోయినా.

బస్ ఆగీ ఆగకుండానే బయలుదేరింది కొంపమునిగిపోయినట్లుగా. అక్కడ నుంచి రెండో బస్‌స్టాప్ అయిన పాటిగడ్డ దగ్గర ఆగింది డబుల్ డెక్కర్. కాదు ఆపబడింది. అక్కడికి ముందున్న పోలీస్‌లైన్స్‌దగ్గర బస్ ఆపి, బస్‌లోని ప్రయాణీకులకందరికీ కండక్టర్ టికెట్స్ ఇచ్చి వుండాల్సింది ఆ స్టాప్ టికెట్స్ ఇష్యూస్ కంప్లీటింగ్ పాయింట్ కనుక.

లేటయిందని కండక్టర్ ఆ పనిచేయలేదు. ఆ తర్వాత బస్‌స్టాప్, పాటిగడ్డ దగ్గర బస్‌ని ఆపారు మొబైల్ స్క్వాడ్‌వాళ్ళు ఇద్దరు టి సి లు బస్‌లోకి జొరబడి టికెట్స్‌లేని వాళ్ళని చలాన్‌చేసి బస్‌దింపేసారు దాదాపు పదిమందిని దాకా పట్టుకున్నారు

నేనూ వాళ్ళలో ఒకడిని. ట్రాఫిక్ పోలీసుల వెంట మమ్మల్ని దగ్గరలోనే ఆగివున్న మొబైల్ కోర్ట్‌కి పట్టుకెళ్ళారు. కనీసం పదయినా వదులుతుందన్న భయం. అంతకంటె ఫైన్‌వేస్తే కట్టేందుకు నాదగ్గర పైకం కూడాలేదు ఆ సమయంలో. చేతిలోని ఆఫీస్ రిక్రియేషన్ క్లబ్ పుస్తకం తప్ప మరేమీలేదు.

ఒక్కొక్కళ్ళని మేజిస్ట్రేట్ విచారించి అయిదూ, పది మధ్య ఫైన్ విధించసాగాడు, టికెట్ లేకుండా ప్రయాణిస్తున్న నేరానికి.

నేను ఏడోవాడ్ని. నా నేరాన్ని వప్పుకున్నాను వాదిస్తే ఫైన్ పెరుగుతుందని తెలుసు నాకు.

మెజిస్ట్రేట్ నావంక కాసేపు నిశితంగా చూశాడు. మిగతా అరుగురి కన్నా నేను ఎక్కువసేపు నిలబడ్డాను బోనులో. ఆయన నన్ను నిశ్శబ్దంగా కనిపించీ కనిపించని చిరునవ్వుతో గమనించటం చూసి ఫైన్ ఎక్కువ వేస్తాడనుకున్నాను.

ఆశ్చర్యం!

ఒక్క పైసా ఫైన్ వేయకుండా వదిలేశాడు నన్ను! ఆ తర్వాత దోషికి ఎనిమిదిరూపాయల ఫైన్ విధించాడు.

ఫైన్ కట్టకుండానే దిగిపోయి పేరడైజ్ స్టాప్‌దాకా నడిచేవెళ్ళాను ఎందుకు మెజిస్ట్రేట్ నాకు ఫైన్ వేయలేదని ఆలోచిస్తూ.

నిన్ననే సమాధానం దొరికింది ఆ ప్రశ్నకి. గాంధీభవన్‌లో డ్రామా చూడటానికి వెళ్ళినప్పుడు ఆ మెజిస్ట్రేట్ ఆ డ్రామా రచయిత, ఆ రోజు మొబైల్ కోర్టు బోనులో నిలబడ్డప్పుడు నా చేతిలో వున్న నవల కూడా ఆయన రాసిందే.

(1978—వీచిక)

# పోస్టుచేయని కథ

"సారీ సార్. మిమ్మల్ని పొద్దున్నే డిస్టర్బ్ చేసినట్లున్నాను" అన్నాడు సిద్ధార్థ పొద్దునే వచ్చి.

"పర్వాలేదు. రండి" అన్నాను.

ఆ రోజు ఆదివారం. అంతకు నాలుగు రోజులు ముందు పరిచయం అయ్యాడు సిద్ధార్థ నాకు, మా స్నేహితుడింట్లో. మా స్నేహితుడి ప్రక్క ఇల్లే అతనిది. నేను కథలు వ్రాస్తూంటానని సిద్ధార్థకి మాటల్లో ఒకసారి ఎప్పుడో మా స్నేహితుడి భార్య చెప్పిందట. ఈసారెప్పుడయినా వస్తే